సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 4 । ఆగస్టు । 2025



పాపికొండల్లో అడవి దున్నలు

అరుదైన జంతు జాలానికి నిలయమైన పాపికొండల అభయారణ్యంలో అడవి దున్నల ఉనికిని అధికారులు గుర్తించారు. 8లో



నీరందక ఆక్వా రైతు విలవిల

ఆగడాలలంక చానల్ పరిధిలోని ఆక్వా చెరువులకు నీరందడం లేదు. 7 వేల ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారింది. 8లో



మున్సిపాలిటీలో అవినీతి భాగోతం

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లా కేంద్రంలోని భీమవరం మున్సిపాలిటీ అవినీతి అధికారులకు అడ్డాగా మారిపోయింది. 8లో

న్యూస్‌రీల్

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు



ద్వారకాతిరుమలలో నిలిచిన బస్సు వద్ద ప్రయాణికులు

ద్వారకాతిరుమల: స్థానిక వెలుగు కార్యాలయ సమీపంలో ఆదివారం ఆర్టీసీ బస్సు టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పింది. డ్రైవర్ అప్రమత్తమై చాకచక్యంగా బస్సును నిలుపుదల చేయడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఏలూరు నుంచి ద్వారకాతిరుమల మీదుగా జంగారెడ్డిగూడేనికి 40 మంది ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సుకు ఘటనా స్థలం వద్ద ఎత్తు ఎక్కేటప్పుడు ఒక్కసారిగా టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో రోడ్డు వెనుక పల్లంగా ఉండటంతో బస్సు అదుపు తప్పింది. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును గేర్‌లో నిలుపుదల చేశారు. దీంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం వారిని వేరే బస్సులో ఎక్కించి పంపించారు.

వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ శ్రేణుల దాడి

నూజివీడు: వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడనే కక్షతో నూజివీడు మండలం జంగంగూడెంలో వైఎస్సార్‌సీపీ నేత తొమ్మండ్రు రాజేశ్వరరావుపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఇద్దరు శనివారం రాత్రి దాడికి పాల్పడ్డారు. రాజేశ్వరరావు రెండు నెలలుగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తూ విజయవంతంగా సాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఓర్వ లేని టీడీపీ కార్యకర్తలు కొలికపాం వెంకటేశ్వరరావు, తొమ్మండ్రు సింహాద్రి మాట్లాడాలని చెప్పి గ్రామంలోని చెరువు కట్ట వద్దకు రాజేశ్వరరావును తీసుకువెళ్లి రాయితో దాడి చేసి కొట్టారు. రాజేశ్వరరావు వారి నుంచి తప్పించుకుని తుక్కులూరు చేరుకుని 108 వాహనం ద్వారా నూజివీడు ఏరియా ఆస్పత్రిలో చేరా రు. బాధితుడి నుంచి పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు.

ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వైద్య విద్యలో ఎండీ, ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశల నిమిత్తం ఆదివారం నీట్ పీజీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. నగరంలోని సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్ విద్యాసంస్థల్లో 373 మంది విద్యార్థులకు 343 మంది హాజరయ్యారు. సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 200 మందికి 181 మంది, సిద్ధార్థ క్వెస్ట్‌లో 173 మందికి 162 మంది హాజరయ్యారు.

భీమవరంలోని ఒక కేంద్రంలో..

భీమవరం: భీమవరంలో ఆదివారం నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. డీఎన్నార్ అటానమస్ కళాశాలలో ఉదయం 169 మంది విద్యార్థులకు 160 మంది హాజరయ్యారని, మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని కళాశాల పరీక్షల నిర్వాహకుడు తెలిపారు.

విద్యార్థుల హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వం

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం విద్యార్థుల హక్కులను కాలరాస్తోందని ఎస్ఎఫ్ఐ ఏలూరు నగర కార్యదర్శి బి.మనోజ్ విమర్శించారు. స్థానిక ఎన్ఆర్‌పేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30/67 జీఓను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ జీఓ ద్వారా కార్పొరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా దోచుకోవడానికి మంత్రి లోకేష్ అవకాశమిచ్చారన్నారు. చైతన్య, నారాయణ విద్యాసంస్థల్లో ఇప్పటికే పలువురు విద్యార్థులు ఒత్తిళ్లతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఈ జీఓ వెనక్కి తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని మనోజ్ హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు ఎస్.శివాజీ మాట్లాడుతూ ఏలూరులోని ప్రభుత్వ హాస్టళ్లలో పలు సమస్యలు ఉన్నాయని, ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులు మత్తుపదార్థాలకు అలవాటు పడ్డారన్నారు. అమీనాపేటలోని బాలికల హాస్టల్‌కు రక్షణ కరువైందన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నగర నూతన కమిటీ ఎన్నికైంది.

బీసీ హాస్టళ్ల తనిఖీ

ఏలూరు (టూటౌన్): ఏలూరులోని బీసీ సంక్షేమ హాస్టళ్లను ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ సంచాలకుడు డి.చంద్రశేఖరరాజు తనిఖీ చేశారు. ఏలూరులోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలు, బీసీ బాలికల వసతి గృహం నం.1, 2, కళాశాల వసతి గృహం నం. 1,2లను పరిశీలించారు. విద్యార్థుల భోజనాలు, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం క్లీన్–గ్రీన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఆర్‌వీ నాగరాణి, సహాయ బీసీ సంక్షేమ అధికారి టి.వెంకటేశ్వర్లు, వసతి గృహ సంక్షేమ అధికారులు ఉన్నారు.

ఈ శ్రావణంలోనైనా ఇచ్చేనా?

గూడు.. గోడు

- టిడ్కో గృహాల పంపిణీకి కూటమి హామీలు
- శ్రావణమాసంలో ఇస్తామంటూ వాగ్దానాలు
- కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత రెండో శ్రావణం
- ఇంకా 30 శాతం పనుల పెండింగ్
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2,560 మందికి ఫ్లాట్లు అందజేత



పెంకుళ్లపాడులో పనులు జరుగుతున్న టిడ్కో గృహాల్లో ఓ భాగం (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: అధికారమే పరమావధిగా కూటమి నాయకులు ఎన్ని బూటకపు హామీలైనా ఇస్తారనడానికి పాలకొల్లులో టిడ్కో ఇళ్ల పంపిణీయే నిదర్శనం. ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టి తీరా గద్దెనెక్కిన తర్వాత హామీలను బుట్టదాఖలు చేయడం కూటమి నాయకులకు పరిపాటిగా మారింది. 2024 ఏప్రిల్ 6న పాలకొల్లులో జరిగిన టీడీపీ ఎన్నికల సభలో స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుతో పాటు టీడీపీ అధినేత చంద్రబాబు ఈ శ్రావణమాసంలో టిడ్కో లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024లో శ్రావణ మాసం ముగియగా ఈ ఏడాదిలో రెండో శ్రావణం కూడా వచ్చింది. అయినా టిడ్కో ఇళ్ల పనుల్లో పురోగతి లేదు. దాదాపు 30 శాతం వరకు పనులు మిగిలి ఉన్నాయి. ఇంకెన్ని శ్రావణాలు ఎదురుచూడాలని ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయి.

10 శాతం పనులే అంటూ..

స్థానిక ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి నిమ్మల 2019 ఎన్నికల్లో పెంకుళ్లపాడు టిడ్కో గృహాలు పనులు పూర్తికాకుండానే గృహ ప్రవేశాలు చేయించారు.



శ్రావణ మాసంలో టిడ్కో గృహప్రవేశాలు

'నేను టిడ్కో ఇళ్ల రూపంలో ఒక్కో లబ్ధిదారుకు రూ.20 లక్షల ఆస్తి ఇస్తే.. వాటిని లబ్ధిదారులకు ఇవ్వడానికి జగన్‌కు మనసు రాలేదు. సెంటు పట్టాల్లోనూ దోపిడీ చేశారు. టిడ్కో ఇళ్ల కోసం ఎమ్మెల్యే రామానాయుడు ఎంతో కృషిచేశారు. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే శ్రావణమాసంలో టిడ్కో గృహప్రవేశాలు చేయిస్తాం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాల సామాజికవర్గానికి, ఉమ్మడి పశ్చిమలో మాదిగ సామాజికవర్గానికి ఎమ్మెల్సీ ఇచ్చి సామాజిక న్యాయం చేస్తాం' అని చంద్రబాబు తెలిపారు.

గత ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రచార సభలో ఇచ్చిన హామీ క్లిప్పింగ్

లబ్ధిదారులకు పత్రాలు తప్ప ఎవరికీ ఇళ్లు ఇవ్వలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల వరకూ టిడ్కో గృహాల్లో పనులు టీడీపీ హయాంలోనే 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేయలేదంటూ తప్పుడు ప్రచారం చేశారు. తాము అధికారంలోకి వస్తే పనులు పూర్తిచేసి శ్రావణంలో ఫ్లాట్లు ఇస్తామంటూ వాగ్దానాలూ చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది.. 10 శాతం పనులు వెంటనే పూర్తిచేసి ఫ్లాట్లు అప్పగిస్తారని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూశారు. అయితే వారికి నిరాశే ఎదురైంది.

112 బ్లాక్‌ల్లో పనులు

ప్రస్తుతం టిడ్కో గృహాల్లోని 112 బ్లాక్‌ల్లో పనులు జరుగుతున్నాయి. పెయింటింగ్, ప్లంబింగ్ పనులు చేస్తున్నారు. సుమారు 70 శాతం పనులు పూర్తికాగా మిగిలిన పనులు జరుగుతున్నాయి. మొత్తం పనులన్నీ పూర్తికావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది.

నువ్వు ఇంజనీరింగ్ ఎక్కడ చదివావయ్యా అంటూ..

టిడ్కో గృహాల లబ్ధిదారుల కోసం నరసాపురం రోడ్డును కలుపుతూ పాలకొల్లు–నరసాపురం కెనాల్‌పై వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇటీవల వంతెన వద్ద బస్టాండ్ నిర్మాణ పనులపై ఓ ఇంజనీరింగ్ అధికారిని నువ్వు ఇంజనీరింగ్ ఎక్కడ చేశావయ్యా అంటూ మంత్రి నిమ్మల ప్రశ్నించారు. భీమవరంలో ఓ ప్రైవేట్ కళాశాలలో చదివానని ఆయన సమాధానం చెప్పారు. వెంటనే మంత్రి ఆ కళాశాలకు ఫోన్ చేసి చిన్నపాటి పనులు చేయడంలోనూ అధికారులు తప్పిదాలు చేస్తుంటే మీ కళాశాలలోనే చదివారా అనే అనుమానం కలుగుతుందని అడిగినట్టు సమాచారం. దీంతో సదరు అధికారి అవమానంగా ఫీల్ అయ్యారని తెలిసింది. ఇలా మంత్రి తీరుతో నియోజకవర్గంలో అధికారులు భయంతో విధులు నిర్వహిస్తుండటం గమనార్హం.

ఇంకెన్ని శ్రావణాలు కావాలో..



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే 42 శాతం పనులు పూర్తిచేసి 2,560 మందికి టిడ్కో ఇళ్లు అప్పగించాం. మంత్రి నిమ్మల మాత్రం గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 90 శాతం పనులయ్యాయని చెప్పుకున్నారు. ఆయన లెక్కల ప్రకారం పది శాతం పనులు పూర్తి చేయడానికి ఇంకా ఎన్ని శ్రావణ మాసాలు కావాలో చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ శ్రావణ మాసం ముగిసేలోపు టిడ్కో గృహాలు అందిస్తే సంతోషిస్తాం. లేకుంటే 2029 ఎన్నికల వరకూ లబ్ధిదారులను మభ్యపెట్టాలనే ఆలోచనలో మంత్రి ఉన్నట్టు సందేశించాల్సి వస్తుంది.

–గుడాల శ్రీహరిగోపాలరావు, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, పాలకొల్లు

గత ప్రభుత్వంలో 2,560 మందికి ఫ్లాట్లు

2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజ**శేఖరరెడ్డి హయాం**లో పాలకొల్లులో పేదల **ఇళ్ల నిర్మాణం కో**సం పెంకుళ్లపాడు, రామ**య్యహాలు, పెద**గరువు ప్రాంతాల్లో సుమా**రు 70 ఎకరాల భూ**మిని కొనుగోలు చేశారు. **పెంకుళ్లపాడులో 5**0 ఎకరాలు భూమిని కేటా**యించారు. 2014**లో టీడీపీ హయాంలో **పెంకుళ్లపాడులో** 6,144 మంది లబ్ధిదారుల కోసం (ఒక్కో బ్లాక్‌లో ఒక్కో ఫ్లోర్‌కు 8 పోర్షన్ల చొప్పున 4 ఫ్లోర్‌లకు 32 పోర్షన్లు) 192 బ్లాక్‌ల నిర్మాణం చేపట్టారు. 2019 ఎన్నికలకు ముందు పనులు పూర్తికాకుండానే ఎమ్మెల్యే నిమ్మల గృహప్రవేశాలు అంటూ హడావుడి చేశారు. అయితే ఫ్లాట్లను మాత్రం లబ్ధిదారులకు అప్పగించలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 80 బ్లాక్‌ల పనులు పూర్తిచేసి 2,560 మంది లబ్ధిదారులకు ఫ్లాట్లను అప్పగించగా వారంతా నివాసముంటున్నారు. ఇంకా 112 బ్లాక్‌ల పనులు పూర్తికావాల్సి ఉంది. ఈ లెక్కన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సుమారు 42 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే ఎమ్మెల్యే నిమ్మల మాత్రం 2019 నాటికే 90 శాతం పనులు పూర్తయ్యాయంటూ చెప్పుకుంటూ వచ్చారు.

మద్యం షాపులో ఘర్షణ

ఇద్దరికి గాయాలు



గాయపడిన యువకులు

తణుకు అర్బన్: మద్యం దుకాణంలో ముగ్గురు వ్యక్తుల మధ్య జరిగిన వాగ్వివాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. తణుకులో జాతీయ రహదారిలోని పాత బెల్లం మార్కెట్ ప్రాంతంలో రష్మిక మద్యం షాపు వద్ద ఆదివారం జరిగిన సంఘటనలో బీరు సీసాతో దాడికి తెగబడ్డారు. తణుకు పాతవూరుకి చెందిన సనమండ్ర రాజేష్, ముప్పిడి సత్యనారాయణ, చదలవాడ కిరణ్ మద్యం తాగుతుండగా పాత కక్షల నేపథ్యంలో ఘర్షణ రేగింది. దీంతో రాజేష్ బీరు సీసా పగులకొట్టి సత్యనారాయణ, కిరణ్‌లపై దాడి చేశాడు. తీవ్ర గాయాలైన ఇద్దరిని తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తణుకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

బుట్టాయగూడెం: కండ్రికగూడెం సాయిబాబా గుడి సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గిరిజన భార్యాభర్తలను ఆదివారం ఆటో ఢీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దొరమామిడి సమీపంలోని నిర్వాసిత గ్రామం సరుగుడుకు చెందిన ఇరపా పెంటయ్య, భార్య కుమారి రాజానగరంలో ఉన్న తమ కుమార్తెను చూసేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యంలో కండ్రికగూడెం వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో వారి వాహనాన్ని ఆటో ఢీకొట్టడంతో కింద పడ్డారు. పెంటయ్య తలకు, కాళ్లకు గాయాలు కాగా కుమారికి స్వల్పగాయాలయ్యాయి.

నేడు చలో కలెక్టరేట్

జంగారెడ్డిగూడెం: గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల చలో కలెక్టరేట్ ధర్నాను సోమవారం ఉదయం 10 గంటలకు ఏలూరులో చేపట్టనున్నట్టు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన జంగారెడ్డిగూడెంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్వీస్ రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. భూములు ఇచ్చిన రైతులకు తగిన పరిహారం అందక నష్టపోయారని, న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. అండర్ పాస్ బ్రిడ్జిలు, ఉచిత బోర్లు, కరెంటు వైర్లు వంటి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు సిరిబత్తుల సీతారామయ్య, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో నిఘా



కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద పోలీసుల పర్యవేక్షణ

కైకలూరు: ప్రసిద్ధి గాంచిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద ఇకపై ప్రతి ఆదివారం డ్రోన్లతో నిఘా ఉంటుందని కైకలూరు రూరల్ ఎస్సై వి.రాంబాబు తెలిపారు. దేవస్థానం వద్ద ఆదివారం డ్రోన్లతో పరిశీలన చేశామన్నారు. ఎవరైనా దేవస్థానం వద్ద పేకాట, గంజాయి సేవనం వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే డ్రోన్‌ల పుటేజీల ఆధారంగా కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో కూడా డ్రోన్లు ఉపయోగపడతాయని చెప్పారు.

టీచర్లపై బోధనేతర భారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని ఏపీటీఎఫ్ 1938 నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీటీఎఫ్ 1938 జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక పవర్‌పేట మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా అధ్యక్షుడు ఈ.రామ్మోహనరావు అధ్యక్షతను నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ గుగ్గులోతు కృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై సీఎం వెంటనే జోక్యం చేసుకోవాలన్నారు. 117 జీఓ రద్దు పేరుతో తొమ్మిది రకాల పాఠశాలలను తీసుకువచ్చి విద్యావ్యవస్థను దెబ్బతీశారన్నారు. జెడ్పీ టీచర్లను కాదని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎంఈఓ–1 పోస్టులకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం దారుణమన్నారు. పెండింగ్ బకాయిలు, పీఆర్‌సీ, ఐఆర్, డీఏల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మోహన్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడు ఆర్‌డీవీ ప్రసాద్, జిల్లా గౌరవ అధ్యక్షుడు జి.రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్వీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలు ఇంకెప్పుడు?

విద్యార్థుల జీవితాలతో ఆటలా..

- డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇవ్వని ప్రభుత్వం
- ఇంటర్ ఫలితాలు వచ్చి దాదాపు 4 నెలలు
- డిగ్రీ ప్రవేశాల కోసం విద్యార్థుల ఎదురుచూపులు
- ఏలూరు, పశ్చిమలో 91 కళాశాలలు



ఏలూరులో కోటదిబ్బపై ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్ పూర్తయిన విద్యార్థులు డిగ్రీ ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థుల్లో సగం మందికి పైగా ఇంజనీరింగ్ వైపు దృష్టి సారించగా.. మిగిలిన సగం మందికి డిగ్రీ విద్య ప్రత్యామ్నాయం. డిగ్రీలో సైతం పలు సాంకేతిక కోర్సులతో పాటు ఆర్ట్స్, సైన్స్ సబ్జెక్టులతో కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో 50 శాతం మంది విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. డిగ్రీ కోర్సులు పూర్తిచేసి సివిల్స్, సర్వీస్ కమిషన్, బ్యాంకింగ్, రైల్వేలో ఉద్యోగాలు సాధించే అవకాశం ఉండటంతో ఈ కోర్సులపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నాయి. అయితే కూటమి ప్రభుత్వంలో 2025–26 విద్యా సంవత్సరంలో ఇప్పటివరకూ డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేయలేదు.

ఫలితాలు వచ్చి నాలుగు నెలలు

ప్రభుత్వం ఇంటర్మీడియెట్ ఫలితాలను ఈ ఏడాది ఏప్రిల్ 12న విడుదల చేసింది. పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా నిర్వహించి జూన్ 7న ఫలితాలు విడుదల చేసింది. ఇంజనీరింగ్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ ముగిసి విద్యార్థులు తమకు సీటు వచ్చిన కళాశాలల్లో ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకూ రిపోర్టు చేయనున్నారు. తమతో పాటు ఇంటర్మీడియెట్ రాసిన మిత్రుల్లో కొందరు ఇంజనీరింగ్ విద్యకు వెళ్లడం, వారు మరో మూడు, నాలుగు రోజుల్లో తరగతులకు హాజరయ్యే పరిస్థితి ఉంది. వారితో పాటే ఇంటర్ పూర్తి చేసుకుని డిగ్రీ కోర్సుల్లో చేరుదామని ఎదురుచూస్తున్న విద్యార్థులకు మాత్రం ఇప్పటి వరకూ నోటిఫికేషనే ఇవ్వకపోవడం చూస్తుంటే ప్రభుత్వం డిగ్రీ విద్యను ఎంతటా నిర్లక్ష్యం చేస్తోందో అర్థమవుతుందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎదురుచూపులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు.

91 కాలేజీలు.. 60 వేల సీట్లు

ఏలూరు జిల్లాలో 40, పశ్చిమగోదావరి జిల్లాలో 51 డిగ్రీ కళాశాలు ఉన్నాయి. వివిధ గ్రూపుల్లో సుమారు 60 వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి.

విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభుత్వ విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతోంది. ఇప్పటికే పలు అసంబద్ధ నిర్ణయాలతో పాఠశాల విద్యను అటకెక్కించారు. ఇప్పుడు డిగ్రీ విద్యను కూడా నాశనం చేయాలని చూస్తున్నారు. ఇంటర్ ఫలితాలు వెల్లడై దాదాపు 100 రోజులు కావస్తోంది. 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచిపోతోంది. డిగ్రీ ప్రవేశాలు ఇంకెప్పుడు చేపడతారు. రెండు నెలల పాటు విద్యకు దూరంగా విద్యార్థులు ఉన్నారు. వారి భవిష్యత్‌తో ఆటలాడటం ప్రభుత్వానికి తగదు.

– కాకి నాని, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

ఎదురుచూపులు

డిగ్రీలో ఏఏ కోర్సులతో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఏ కోర్సులు తేలికగా పూర్తి చేసి, పూర్తి చేసిన వెంటనే ఉద్యోగాలు వచ్చే కోర్సులు ఏమిటి అనే విషయాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇప్పటికే తమకు తెలిసిన విద్యాధికులను సంప్రదించి ఒక నిర్ణయానికి వచ్చి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్నారు. సాధారణంగా ఇంటర్మీడియెట్ ఫలితాలు వెలువడిన నెలలోపే డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించి విద్యా సంవత్సరం ఆరంభం నాటికి విద్యార్థులంతా కళాశాలలకు వెళ్లే ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఇప్పటివరకూ ఆ దిశగా ఏ చర్యా తీసుకోకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన పెరిగిపోతోంది.

డిగ్రీ కళాశాలలు

	ఏలూరు జిల్లా	పశ్చిమగోదావరి
ప్రభుత్వ	7	4
ప్రభుత్వ అటానమస్	-	2
ప్రభుత్వ ఎయిడెడ్ అటానమస్	1	4
ప్రైవేట్ అటానమస్	1	1
ప్రైవేట్ ఎయిడెడ్	-	1
ప్రైవేట్ అన్ ఎయిడెడ్	31	39
మొత్తం	40	51

సీఎస్‌సీ భవన నిర్మాణానికి చర్యలు



బొండాడలో మార్కింగ్ చేస్తున్న అధికారులు

సాక్షి స్పందన

కాళ్ల : మండలంలోని బొండాడ గ్రామంలో సచివాలయం వద్ద రూ.లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లను ప్రైవేట్ వ్యక్తులు కూల్చివేయడంతో అధికారులు తప్పును సరిదిద్దుకునే పనిలో నిమగ్నమయ్యారు. సచివాలయ భవనం ప్రారంభం కాకుండానే మరుగుదొడ్లను కూల్చివేయడంపై గత నెల 27న 'సాక్షి'లో ప్రచురించిన 'ప్రభుత్వ భవనాలకే రక్షణ లేదు' కథనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. ఎవరైతే భవనాన్ని కూల్చారో వారే కట్టించేలా చూడాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శితో పాటు అధికారులపై డిప్యూటీ స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు కూల్చిన వ్యక్తితోనే భవనాన్ని కట్టిస్తున్నారు. ఆదివారం సీఎస్‌సీ భవనం (కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్) నిర్మాణానికి ఇంజనీరింగ్ సిబ్బంది మార్కింగ్ వేశారు. మెటీరియల్ సిద్ధం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫణి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఎవరైనా ప్రభుత్వ ఆస్తుల ధ్వంసానికి పాల్పడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

క్లుప్తంగా

22న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



విశేష అలంకారాల్లో వరలక్ష్మీ అమ్మవారు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో ఆఖరి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈనెల 22న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని అనివేటి మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి జరిగే ఈ వేడుకలో పాల్గొనాలని ఆయన కోరారు.

చిన్న తిరుపతిలో కిటకిటలాడిన భక్తులు



భక్తులతో పోటెత్తిన దర్శనం క్యూలైన్లు

ద్వారకాతిరుమల: చిన్నతిరుపతి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవుదినం కావడంతో పాటు, శ్రావణ మాస పర్వదినాలను పురస్కరించుకుని వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారు జాము నుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో పోటెత్తాయి. ఆలయ అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. క్షేత్రంలో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

గుబ్బల మంగమ్మతల్లి గుడికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కాపవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చి అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధికంగా మంగమ్మతల్లి దర్శనానికి రావడంతో పోలీసులు ప్రత్యేక చర్యలు చేట్టారు.

నీరందక ఆక్వా రైతు విలవిల

శివారుకు చేరని ఆగడాలలంక చానల్ నీరు



ఆగడాలలంక చానల్‌లో గుర్రపు డెక్క, తూడు



ఆగడాలలంక చెరువును నీటితో నింపిన దృశ్యం

భీమడోలు: ఆగడాలలంక చానల్ పరిధిలోని ఆక్వా చెరువులకు నీరందక రైతులు ఆందోళన చెందుతున్నారు. 7 వేల ఎకరాల ఆక్వా ఆయకట్టులోని చేపల సాగు ప్రశ్నార్థకంగా మారింది. సకాలంలో నీరందించకపోవడంతో చేపలు, చేపల పిల్లలు మృత్యువాత పడి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు లబోదిబోమంటున్నారు. మురుగునీటిని చెరువుల్లో నింపుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి కాలువలో నీటి లెవెల్స్ ఎక్కువగా ఉన్నందున రెండు అడుగుల మేర నీటిని విడుదల చేయాలని మొరపెట్టుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

చానల్ పరిధిలో భోగాపురం, వడ్డిగూడెం, లక్ష్మీపురం, సీతారామనగరం, ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరంతో పాటు ఏలూరు రూరల్ మండలానికి చెందిన పలు గ్రామాలకు మంచినీరు, సాగునీరు అందిస్తారు. చానల్‌లో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్కతో నీరు కిందకు పారడం లేదు. ఈ సమయంలో అడుగులోపు నీరందించడం వల్ల శివారుకు నీరు చేరడం లేదు. మోటార్లు పెట్టి నీటిని తోడుకుంటున్నారు. నెలకు 10 రోజుల మాత్రమే నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సరిగా లేక రైతులు కాల్వ నీటిపై ఆధారపడి సాగు చేస్తున్నారు. నీరు లేకపోవడంతో చేప పిల్లలు బతికే అవకాశాలు తగ్గిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.33 లక్షల నీటి తీరువా వసూలు చేశారు

అర అడుగు నీటి వల్ల వరి రైతులు, ఆక్వా రైతులకు ప్రయోజనం లేదని చెట్టున్నపాడు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు ఆర్.రామకృష్ణం రాజు విమర్శించారు. గ్రామాల్లోని మంచినీటి చెరువులకు నీటిని తోడుకోవాల్సి ఉందని, ఇరిగేషన్ అధికారులు నీటిని పూర్తి స్థాయిలో అందించడం లేదన్నారు. సార్వా నాట్లు పూర్తయినా నీటి వినియోగం తగ్గినా ఆక్వా చెరువులకు నీరివ్వడం లేదని, నీటి తీరువా కింద రూ.33 లక్షలు రైతులు ప్రభుత్వానికి చెల్లించారని చెప్పారు.

నీటిని విడుదల చేస్తున్నాం

గోదావరి కాల్వలో నీటి లభ్యత ఆధారంగా నీరిందిస్తున్నాం. వరి సాగు, మంచినీటి అవసరాలు తీర్చిన తర్వాతనే ఆక్వాకు నీరందిస్తాం. మంచినీటి చెరువులన్నీ నింపాం. వరి పొలాలకు నీరందించాం. వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో మెరక తూములకు నీరందక రైతులు, ఆక్వా రైతులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. అయినప్పటికీ నీటిని సరఫరా చేస్తున్నాం. గుండుగొలను వద్ద నీటి మట్టం 4.6 అడుగుల వరకూ ఉంది. ఆగడాలలంక చానల్‌కు రెండు అడుగుల నీటిని విడుదల చేస్తే... గోదావరి కాల్వ ఆయకట్టుపై ప్రభావం పడుతుంది.

–సుబ్రహ్మణ్యం, ఏఈ, ఇరిగేషన్ సెక్షన్

బందా మృతి తీరని లోటు



బందా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త వీ.బందా మృతి సాహితీ లోకానికి తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. బందా సంతాప సభను సాహిత్య మండలి, గరికిపాటి ఆర్ట్స్, హేలాపూరి కళా పరిషత్, జిల్లా రచయితల సంఘం తదితర సాహిత్య కళా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గొప్ప స్నేహ శీలి, మంచి సాహితీవేత్త బందా అన్నారు. గరికిపాటి కాళిదాసు మాట్లాడుతూ ప్రవచనకారుడు గరికపాటి నరసింహారావు ద్విశత అవధానం కార్యక్రమం బందా నేతృత్వంలో నిర్వహించామని గుర్తుచేసుకున్నారు. లేళ్ళ వెంకటేశ్వరావు, మహమ్మద్ ఖాజావలీ, నాగాస్త్ర పుల్లాభొట్ల పురుషోత్తం, పీ సత్యవాణి, పీ ఆంజనేయులు, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పాపికొండల్లో అడవి దున్నలు

- రాత్రి, పగలు తేడా లేకుండా దురుసుగా తిరిగే జంతువు
- మనుషులు కనిపిస్తే దాడిచేసే ప్రమాదం





పాపికొండల అభయారణ్యంలో ట్రాప్ కెమెరాకు చిక్కిన అడవి దున్నలు

బుట్టాయగూడెం: అరుదైన జంతు జాలానికి నిలయమైన పాపికొండల అభయారణ్యంలో అడవి దున్నల ఉనికిని గుర్తించారు. సింహాలు, పులులు, ఏనుగులను సైతం తరిమి కొట్టే సత్తా ఉన్న జంతువులు ఈ అడవిదున్నలు. అభయారణ్య పరిధిలోని గోదావరి పరీవాహక ప్రాంతంలో ఇవి ఎక్కువగా సంచరిస్తుంటాయి. సుమారు 10 నుంచి 20 వరకూ గుంపులుగా ఈ అడవి దున్నలు మేత కోసం తిరుగుతూ ఉంటాయి. వైల్డ్ లైఫ్ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలకు ఈ అడవి దున్నలు చిక్కాయి. మొత్తం 420 పైగా అడవి దున్నలు పాపికొండల అభయారణ్యంలో సంచరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అడవుల్లోని గడ్డితోపాటు లేత వెదురు చిగుళ్లను ఇవి ఆహారంగా తీసుకుంటాయి. రాత్రి, పగలు కూడా దురుసుగా తల ఎగరేస్తూ సంచరిస్తాయి. మనుషులు కనిపిస్తే దాడి చేస్తాయి. అడవి దున్నల దాడుల్లో అనేక మంది మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి.

అడవి దున్నలు భారత ఉపఖండంలోని భారత్, బంగ్లాదేశ్, నేపాల్‌లోని అటవీ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నట్లు వైల్డ్ లైఫ్ అధికారులు చెబుతున్నారు. మన దేశంలో పశ్చిమ కనుమలు, దండకారణ్యాల్లో వీటి ఉనికి ఉంది. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం అటవీ ప్రాంతం, పాపికొండల అభయారణ్యంలోనూ అడవి దున్నల సంచారం అత్యధికంగా ఉంది. నల్లమల్ల అటవీ ప్రాంతంలో అడవి దున్నల సంచారం క్రమేపీ అంతరించిపోవడం వల్ల అక్కడ వీటి సంచారం లేదని అధికారులు అంటున్నారు.

వన్యప్రాణుల కోసం గడ్డి పెంపకం

పాపికొండల అభయారణ్యం పరిధిలో సుమారు 15 హెక్టారుల్లో వన్యప్రాణుల కోసం వైల్డ్ లైఫ్ అధికారులు గడ్డి పంటను పండిస్తున్నారు. ఈ పంట ముఖ్యంగా అడవి దున్నలు, కుందేళ్ల వంటి శాఖాహార జంతువులు తినేలా ఏర్పాటు చేస్తున్నామని అధికారులు అంటున్నారు.

పులిని సైతం మట్టికరిపించే దున్న

ఆరున్నర అడుగుల ఎత్తు.. 12 అడుగుల పొడవు, 800 నుంచి 1500 కేజీల భారీ బరువుతో అడవి దున్నలు ఉంటాయి. పెద్ద పులులను సైతం మట్టి కరిపించే వణ్యప్రాణి అడవిదున్న. దీని జీవిత కాలం 15 నుంచి 20 సంవత్సరాల వరకూ ఉంటుంది.

మండుతున్న ఎండలు



తాడేపల్లిగూడెంలో ఎండకు తాళలేక ముసుగులు వేసుకొని వెళ్తున్న కూలీలు

పెంటపాడు: రోజురోజుకు ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఈ ఎండలు మండు వేసవిని తలపిస్తున్నాయి. ఎండ, ఉక్కపోతతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేక పోతున్నారు. వర్షాలు లేక ఎండకు నాట్లు దెబ్బతినే అవకాశం ఉంది. నాట్ల సమయంలో వర్షం వస్తే ఏపుగా ఎదుగుతాయి. ఎండల వల్ల ప్రజలు బయటకు రాక వ్యాపారాలు కూడా దెబ్బ తింటున్నాయి. స్కూలుకు వెళ్లే చిన్నారులు ఎండ దెబ్బకు అల్లాడుతున్నారు. గూడెం నియోజకవర్గంలో అప్రకటిత విద్యుత్ కోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట అయితే చెప్పక్కరలేదు. పెంటపాడు, గూడెం ప్రాంతాలలో రోజూ 10 గ్రామాల చొప్పున విద్యుత్ కోత ఉంటోంది.

కుంగిన వంతెన.. నిలిచిన రాకపోకలు



దొంగపిండిలో బందాల చేడు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన కుంగిపోయిన దృశ్యం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని దొంగపిండిలో బందాల చేడు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన ఆదివారం తెల్లవారుజామున కుంగిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామంలో సుమారు 6 వేల వరకు జనాభా ఉండగా.. గ్రామం చుట్టూ ఎటు చూసినా కాలువలు ఉన్నాయి. నిత్యం స్కూలు బస్సులు, కూలీలు, కార్మికుల వ్యాన్‌లు, ఆటోలపై పొరుగూరుకు వెళ్లి వస్తుంటారు. గ్రామంలో చేపలు, రొయ్యలు చెరువులు ఎక్కువగా ఉండటంతో తవుడు లోడులు, పట్టుబడులకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గ్రామం నుంచి పొరుగూళ్లు వెళ్లడానికి ఆర్ అండ్ బీ రోడ్డు ఒక్కటే కావడంతో ఆ మార్గంలో వంతెన కుంగిపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

3 దశాబ్దాల నాటి వంతెన

సుమారు 3 దశాబ్దాల క్రితం బందాల చేడు డ్రెయిన్‌పై వంతెన నిర్మించారు. కొంతకాలంగా ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుని అడుగుభాగం పెచ్చులూడిపోవడంతో కొంతమంది గ్రామస్తులు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లారు. ఇంతవరకూ ఎవరూ పట్టించుకోలేదని ఇప్పుడు వంతెన కూలిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుంగిపోయిన వంతెన స్థానంలో ఎప్పుడు కొత్త వంతెన నిర్మిస్తారని, అప్పటి వరకు తమకు కష్టాలు తప్పవా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలికంగా వంతెన నిర్మించాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

భీమవరం మున్సిపాలిటీలో అవినీతి భాగోతం

- ప్రతి సెక్షన్‌లోనూ వసూళ్ల దందా
- మున్సిపల్ ఉన్నతాధికారికి నెలనెలా పేమెంట్లు?



భీమవరం మున్సిపాలిటీ

భీమవరం(ప్రకాశం చౌక్): కూటమి ప్రభుత్వంలో భీమవరం మున్సిపాలిటీ అవినీతి అధికారులకు అడ్డాగా మారిపోయింది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్థానికంగా ఉన్నా, వారి పర్యవేక్షణ లేకపోవడంతో మున్సిపల్ అధికారులు పేట్రేగిపోతున్నారు. కొందరు అధికారులు పైసా లేకపోతే పని జరగదనే స్థాయికి వెళ్లిపోయారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులు భీమవరంలో బిల్డింగ్ నిర్మాణ అనుమతులకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. నిర్మించిన భవనాలకు పన్ను వేయడానికి రెవెన్యూ అధికారులు రూ.15 వేల నుంచి రూ.40 వేల వరకు వసూలు చేస్తున్నారు. సివిల్ పనుల్లో కాంట్రాక్టర్ల నుంచి 2 నుంచి 5 శాతం కమిషన్ ఇంజినీరింగ్ అధికారులు వసూలు చేస్తుండగా.. నెలనెల హోటల్స్, దుకాణాల నుంచి శానిటేషన్ అధికారులు వసూలు చేస్తున్నారు. కుళాయి కనెక్షన్లకు రూ.10 వేలు నుంచి రూ.20 వేలు ఇవ్వాల్సిందే. బర్త్, డెత్ సర్టిఫికెట్లుకు వేలల్లో వసూలు చేస్తున్నారు. భీమవరం మున్సిపాలిటీలో ప్రతి దానిలో అవినీతి రాజ్యమేలుతుంది. ఇటీవల రివ్యూ సమావేశంలో ఎమ్మెల్యే అంజిబాబు టాన్‌ప్లానింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి ఏసీబీకి పట్టిస్తానని చెప్పారు. మున్సిపాలిటిలో పనులుంటేనే ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఉన్నతాధికారికి పేమెంట్‌లు

మున్సిపాలిటీలోని ఉన్నత అధికారికి అన్ని విభాగాల నుంచి నెల నెల పేమెంట్లను ఆయా విభాగాల అధికారులు అందిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. సదరు ఉన్నత అధికారి ఇంటికి భీమవరం నుంచి కాంట్రాక్టర్లతో మెటీరియల్ సరఫరా చేయించుకున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. పేమెంట్లు అందించడం కోసం కొందరు అధికారులు రేటు పెట్టి వసూలు చేస్తున్నారని, అందులో కొంత అధికారికి, మరి కొంత వారికి అన్నట్లు వ్యాపారం సాగిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు భీమవరం మున్సిపాలిటీపై దృష్టి సారించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి.

● విమానం ఎగురుతున్నట్లు..



పచ్చని పొలం నుంచి విమానం పైకి లేస్తున్నట్లు ఉంది కదూ! బుట్టాయగూడెం మండలం కొవ్వాడ సమీపంలోని పచ్చని పొలాల్లో ఒక విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పొదుల తీగలు విమానం ఎగురుతున్నట్లుగా చూపరులకు కనువిందు చేస్తోంది. - బుట్టాయగూడెం

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



సుబ్బారాయుడిని దర్శించుకుంటున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. పాలపొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద స్వామివారి మూర్తులను ప్రతిష్ఠించేందుకు అర్చకులతో పూజలు చేయించి ప్రతిష్ఠ తంతు నిర్వహించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు.

రాట్నాలమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు



ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ

పెదవేగి: పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన రాట్నాలమ్మకు ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దేవస్థానానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఇందులో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసాలు, నామకరణలు, ఇతర మొక్కుబడులు చెల్లించారు. ఈ వారం మొత్తం రూ 79,053 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని లాకు సెంటర్ వద్ద నిడదవోలు–నరసాపురం కాలువలో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం కొట్టుకువచ్చింది. పై నుంచి కొట్టుకొచ్చినట్లుగా స్థానికులు చెబుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాలిక అదృశ్యం

పెదవేగి : బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెదవేగి మండలం రాయన్నపాలెం పంచాయతీ లెల్లగూడెంకు చెందిన బాలిక అదశ్యమైందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

కొయ్యలగూడెం: కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ ఆదివారం పేర్కొన్నారు. వాహనాల తనిఖీలో భాగంగా సిబ్బంది నిర్వహిస్తున్న సోదాలలో 660 కేజీల కోళ్ల వ్యర్థాలతో ఉన్న వాహనాన్ని గుర్తించామన్నారు. దీనిపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన ఒక యువకుడు మతిస్థిమితం లేకపోవటంతో ఇంటినుంచి వెళ్ల పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పడమరవీధి పాలతూము సెంటర్‌కు చెందిన దొంతంశెట్టి సత్యనారాయణ (31)కు కొంత కాలంగా మతిస్థిమితం లేదు. జూలై 23న ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాకపోవటంతో తండ్రి ఆదివారం ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

విద్యుత్ వైర్ల చోరీ

పాలకొల్లు సెంట్రల్: పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న లే అవుట్‌లో విద్యుత్ వైర్లను చోరీ ఘటన వెలుగులోకి వచ్చింది. చిత్రావి చెరువుగట్టు శివారున ఉన్న వల్లభ లేఅవుట్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేశారు. శనివారం రాత్రి విద్యుత్ వైర్లను కట్ చేసి చోరీ చేసినట్లు గుర్తించారు. స్థానికులు లే అవుట్ యజమానికి సమాచారం ఇచ్చారు. విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా.. వారు పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

తణుకు అర్బన్: పశ్చిమగోదావరి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్–14, 16, 18, 20 బాలుర, బాలికల అథ్లెటిక్స్ ఎంపికలను శ్రీ చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించినట్లు అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. బాలుర పోటీలను తణుకు టౌన్ బీజేపీ అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు ప్రారంభించగా, బాలికల పోటీలను తణుకు ఏఎంసీ మాజీ చైర్మన్ బసవ రామకృష్ణ ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుండి 200 మంది హాజరవగా వారిలో 40 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాకు సంబంధించి అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపికకు అనూహ్య స్పందన వచ్చినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ తెలిపారు. స్థానిక ఏఎస్ఆర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన అండర్–14, 16, 18, 20 విభాగాల్లో పెద్ద సంఖ్యలో బాలబాలికలు పాల్గొని తమ ప్రతిభ చూపారన్నారు. పోటీలకు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గుళ్ళా ప్రసాదరావు, జల్లా వీరభద్రరావు, మరడాని అచ్యుతరావు, కోశాధికారి అన్నం శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ముగ్గురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: భార్యా భర్తల గొడవల నేపథ్యంలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ టి.బాబూరావు తెలిపారు. ఈ నెల 1న పింగుల హరీష్‌కు, అతని భార్య మధ్య అక్కంపేటలోని వారి ఇంటి వద్ద చిన్న గొడవ జరిగింది. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరు హరీష్‌పై దాడి చేసి కొట్టారు. మరో వ్యక్తి హరీష్ భార్యను దూషించారు. దీంతో హరీష్ భార్య చీమల మందు తినడంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. ఆదివారం హరీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ టి.బాబూరావు తెలిపారు.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల సందడి



కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి

కై కలూరు: పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల రద్దీ నానాటికి పెరుగుతోంది. ఆదివారం ఉదయం పవిత్ర కోనేరులో స్నానాలు ఆచరించి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ రూ.70,414 ఆదాయం వచ్చిందని తెలిపారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుల ద్వారా పుస్తకాల పంపిణీ



బుక్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఏపీ గవర్నమెంట్ జిల్లా పుస్తక పంపిణీ కేంద్రం నుంచి ఉభయ గోదావరి జిల్లాలోని 48 మండలాలకు గవర్నమెంట్ అసెస్మెంట్ బుక్స్ 12,08,428 పుస్తకాలను ఆర్టీసీ బస్సులు ద్వారా పంపిణీ చేస్తున్నారు. ప్రతి రోజు బస్సు ద్వారా మూడు మండలాల చొప్పున ఆయా మండల కేంద్రాలకు ఈ పుస్తకాలు చేరుతున్నాయి. జిల్లాలోని మూడు మండలాలకు ఆదివారం ఈ పుస్తకాలను పంపిణీ చేశారు. టెక్స్ బుక్స్ మేనేజర్ పీవీ సుధాకర్, ఆర్టీసీ సూపర్‌వైజర్ డి.విజయకుమార్, హమాలీలు, బస్సు డ్రైర్లు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: సీపీఐ జిల్లా మహాసభలు ఈ నెల 19, 20వ తేదీల్లో తణుకులో జరగనున్నాయని, ఈ సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ, కార్పొరేట్ అనుకూల విధానాలు, రాజ్యాంగ స్వయం ప్రతిపత్తి సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు తదితర అంశాలపై ఈ మహాసభల్లో చర్చించడం జరుగుతుందన్నారు. బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఎన్నో పోరాటాలు చేశామని గుర్తు చేశారు.

స్మార్ట్ మీటర్లను ప్రజలంతా అడ్డుకోవాలి

భీమవరం అర్బన్: అదానీ స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ అడ్డుకోవాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఈ నెల 5న జరిగే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ తోకతిప్ప గ్రామంలో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ అనుమతి లేకుండా తమ ఇళ్ల వద్ద స్మార్ట్ మీటర్లు పెడితే కేసులు పెట్టాలని హితవు పలికారు. గతంలో చెత్త పన్నుపై పోరాడితే రద్దు చేశారని, ఇప్పుడు స్మార్ట్ మీటర్లపై పోరాడాల్సిన అవశ్యకత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పొన్నమండ నాగేశ్వరరావు, తిరుమాని సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత రక్తదాన, వైద్య శిబిరం

భీమవరం: స్థానిక కుముదవల్లి రోడ్డులోని కేఎస్ రాజు ఫంక్షన్ హాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి రక్తదాన, వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమశాఖ సహాయమంత్రి పుట్టిన రోజు సందర్భంగా ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నర్తన బాల అవార్డులు

ఆకివీడు: అభినయ నృత్య భారతి ఆధ్వర్యంలో ఏలూరులోని వైఎంహెచ్ఏ హాల్లో ఆదివారం జరిగిన పదో జాతీయ స్థాయి నర్తన బాల అవార్డుల పోటీల్లో ఆకివీడుకు చెందిన ముగ్గురు విద్యార్థినులు అవార్డుల్ని కైవశం చేసుకున్నారు. స్థానికంగా 3, 5, 6 తరగతులు చదువుతున్న కె.నిధి, చాగంటిపాటి పుష్కల నిధి, కె.మౌనిక ఈ అవార్డుల్ని దక్కించుకున్నారు.

ఈపీఎఫ్‌లో ఘనంగా యూత్ సమావేశం



మాట్లాడుతున్న సేవకురాలు ప్రైజీ ప్రవీణ్

పెంటపాడు: నిజమైన స్నేహితుడు విడువక ప్రేమించునన్న బైబిలు వాక్యసారంగా యూత్ విశ్వాసులు ఆధ్యాత్మిక స్నేహభావంగా మెలగాలని ఈపీఎఫ్ సంఘ పాస్టర్ పి.మోజస్‌ప్రవీణ్ పేర్కొన్నారు. తణుకు ఇమ్మానియేలు ప్రార్థనామందిరంలో ఆగస్టు నెల మొదటి ఆదివారం పురస్కరించుకొని యూత్ సమావేశం నిర్వహించారు. సంఘ వ్యవస్థాపకురాలు పి.అరుణకుమారి ఆధ్వర్యంలో ఆదివారం ఆరాధన అనంతరం నిర్వహించిన ఈ సమావేశంలో పాస్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్రైస్తవ యువత తోటివారికి మార్గదర్శిగా ఉండాలన్నారు. సేవకురాలు ప్రైజీ ప్రవీణ్ ఆధ్యాత్మిక సందేశం అందించారు.

మావుళ్లమ్మకు సారె సమర్పణ

భీమవరం (ప్రకాశం చౌక్): శ్రావణమాసం పురస్కరించుకుని పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ అమ్మవారికి భీమవరానికి చెందిన కారుమూరి సత్యనారాయణ ఆదివారం సారె సమర్పించారు.

రోడ్డుపైనే వాహనాలు

- ట్రాఫిక్ ఇబ్బందులు
- ప్రజల అవస్థలు







పట్టణంలో ప్రధాన రహదారుల పక్కగా వాహనాల పార్కింగ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపుల ఉన్న షాపులకు, ఇతర పనులపై వచ్చే వారు రోడ్డుపైనే వాహనాలు నిలుపుదల చేస్తున్నారు. దీని వల్ల పలుమార్లు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జెడ్పీ హైస్కూల్ నుంచి నంది బొమ్మ సెంటర్ వైపు వచ్చే ఓ షాపు వద్ద సరైన పార్కింగ్ లేదు. దీంతో ఆ షాపుకు వచ్చే వారు వాహనాలను రోడ్డుపైన నిలిపి ఆ షాపులోకి వెళ్తున్నారు. ఒక సందర్భంలో కారులు అక్కడే నిలుపుతున్నారు. దీంతో పలుమార్లు ట్రాఫిక్ నిలిచిపోతుంది. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు వెళ్లాలంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిపై వాహనాలు నిలిపివేస్తున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా ఎంతో రద్దీగా ఉండే శేషమహల్ సెంటర్, గతంలో ఉన్న ఆర్టీసీ సమీపంలో నారాయణ షాపింగ్ మాల్ ఏరియాలోను, అదే విధంగా టూటౌన్‌లోని ఓవర్ బ్రిడ్జి పోలీస్ ఐలాండ్ వద్ద నుంచి జయలక్ష్మి థియేటర్ వైపు ఉన్న రోడ్డుకు ఇరువైపుల పార్కింగ్ ప్లేస్‌లు లేకపోవడంతో వాహనాలు రోడ్లుపైనే నిలిపివేస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో రోడ్డుకు ఇరువైపుల డ్రెయిన్ నుంచి తీసిన షిల్ట్‌ను రోడ్డుపైనే ఉంచేశారు. దీని వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయి. ముఖ్యంగా ఆయా సెంటర్లు నాలుగు రోడ్లు కూడలి కావడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు రహదారుల ఇరువైపుల ఉన్న షాపులు వారు సెట్ బ్యాక్ అమలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే కాల క్రమేణ మళ్లీ సెట్ బ్యాక్ ఉన్న స్థలంను వ్యాపారస్తులు తిరిగి వినియోగించుకోవడం ప్రారంభించారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు మళ్లీ మొదటికి వచ్చాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

బధిరుల పాఠశాల వార్షికోత్సవానికి ఏర్పాట్లు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని శ్రీవెంకటేశ్వర బధిరుల పాఠశాల 40వ వార్షికోత్సవాన్ని పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు బధిరుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, అధ్యక్షుడు సీహెచ్ తాతారావు చెప్పారు. ఆదివారం భీమవరంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వేడుకల బ్రోచర్ ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్త బధిర అసోసియేషన్ల ఆహ్వాన మేరకు ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10వ తేదీన డీఎన్నార్ కళాశాల రామకృష్ణ సభాభవనంలో నిర్వహించనున్నామన్నారు. వేడుకల్లో భాగంగా ఈనెల 8, 18, సెప్టెంబర్ 3వ తేదీల్లో బధిరులకు వివిధ కార్యక్రమాలు చేపడతామని రంగసాయి, తాతారావు తెలిపారు. ఈ వేడుకలకు పూర్వ విద్యార్థులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గొట్టుముక్కల శ్రీనివాసరాజు, వి రాము, ఆర్ ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన



భవన నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మోషేనురాజు, అంజిబాబు, రాహుల్‌కుమార్‌రెడ్డి తదితరులు

భీమవరం: ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భాల్లో అగ్నిమాపకశాఖ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఆదివారం భీమవరంలో నూతనంగా నిర్మించే జిల్లా అగ్ని మాపక కేంద్ర కార్యాలయానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్ల వ్యయంతో జిల్లా అగ్నిమాపక కార్యాలయ భవనం, అగ్నిమాపక కేంద్రాలను అన్ని వసతులతో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ టి రాహుల్‌కుమార్ రెడ్డి, జిల్లా అగ్నిమాపకాధికారి బి శ్రీనివాసరావు, ఎఫ్‌డీఓ కె శ్రీనివాసరావు, ఆర్డీవో ప్రసన్నకుమార్ రెడ్డి, తహసీల్దార్ ఆర్ రాంబాబు, లీడింగ్ ఫైర్‌మెన్ సూర్యబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ఉండి: అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం ఉండి గ్రామానికి చెందిన వసంతకు భీమవరం మండలం నర్సింహపురం గ్రామానికి చెందిన ఆల్తి రమేష్‌తో 2022లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.10 లక్షలు నగదు, 8 కాసుల బంగారం కానుకగా ఇచ్చారు. మూడు నెలలు కాపురం సజావుగా సాగినా అక్కడినుంచి భర్త, అత్త, ఆడపడుచులు, వారి భర్తలు అధిక కట్నం తీసుకురావాలంటూ తనను వేధిస్తున్నారని, దీంతో తట్టుకోలేక పుట్టింటికి వచ్చినట్లు వసంత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

బాప్టిస్ట్ సంఘాల బలోపేతానికి కృషి చేస్తా



చెరుకువాడలో బాప్టిస్ట్ ఆకివీడు ఫీల్డ్ నూతన కమిటీని సత్కరిస్తున్న దృశ్యం

ఉండి: బాప్టిస్ట్ చర్చ్ ఈస్ట్ ఆకివీడు ఫీల్డ్‌లోని 74 గ్రామాలకు గాను నియామకమైన నూతన కమిటీ ప్రతినిధులను చెరుకువాడ చినపేట సీబీసీఎన్‌సీ చర్చ్‌లో ఘనంగా సత్కరించారు. ఆదివారం ఎస్ జార్జ్‌ముల్లర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈస్ట్ ఆకివీడు ఫీల్డ్ అధ్యక్షుడు బూరగ జెంజిమెన్, కార్యదర్శి కోరాటి శ్యామ్, కార్యవర్గ సభ్యులు బీ శ్రీకాంత్, కే ఏసుబాబు, ఎం సుబ్బారావు, పీ మార్కురాజు, బీ జార్జ్, టీ పవన్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా బెంజిమెన్ మాట్లాడుతూ సీబీసీఎన్‌సీ చర్చ్ ఈస్ట్ ఆకివీడు ఫీల్డ్‌కు తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సంఘ నాయకులకు, విశ్వాసులకు ధన్యవాదాలు తెలిపారు. బాప్టిస్ట్ సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీ పౌలు, ఎం యేసుబు, ఎం చలపతిరావు, బీ చిన్నా, సీహెచ్ వెంకటేష్, జీ బాబ్జీ, కే జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా శ్రీనివాసరాజు



లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడు శ్రీనివాసరాజు అభినందిస్తున్న దృశ్యం

కాళ్ల: ఏలూరుపాడు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా దాట్ల శ్రీనివాసరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివాయం సాయంత్రం గ్రామంలో నిర్వహించిన లయన్స్‌క్లబ్ సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ క్లబ్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గ్రామ సర్పంచ్ భూపతిరాజు జగ్గరాజు, డాక్టర్ ఆర్‌వీఎస్ రాజు, మోటుపల్లి శ్రీనివాసరావు, మంతెన రవివర్మ, పేర్ని సుబ్రహ్మణ్యం, మంతెన ఆంజనేయరాజు, కనకగర్ల గణేష్, మధుసూదన రావు, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చెట్ల నీడే బాటసారులకు సాంత్వన





పడమరవిప్పర్రు- గణపవరం రహదారిలో నీడనిస్తున్న పచ్చని చెట్లు

తీవ్ర ఎండతో అల్లాడుతున్న ప్రజలు

పెంటపాడు: గత వారం రోజులుగా తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కనుచూపు మేరలో చల్లదనం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో రైతులు, బాటసారులు చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు భానుడు భగభగలాడుతున్నాడు. పలు పనులపై పట్టణానికి వెళ్లేవారు, ప్రయాణాలు చేసేవారు కనిపించడం లేదు. ప్రస్తుతం రైతులు వ్యవసాయ పనులు చేయక తప్పడం లేదు. నాట్లు వేసే పనిలో బిజీగా ఉన్నారు. గతంలో పలు ప్రాంతాలలో రహదారులకు ఇరువైపులా నాటిన చెట్ల వల్ల బాటసారులకు సాంత్వన చేకూరుతోంది. విప్పర్రు- గణపవరం, పెంటపాడు- రాచర్ల, మీనవిల్లూరు- రామచంద్రపురం గ్రామాల మధ్య రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు నీడనిస్తున్నాయి. కొన్ని గ్రామాల మధ్య విద్యుత్ సరఫరాకు అంతరాయంగా ఉన్నాయని పలు చోట్ల ఇష్టాను సారంగా చెట్లను నరికేశారు. కాగా ఎండకు ఉపశమనంగా ఉన్న ఈ చెట్ల వల్ల ఆక్సిజన్ అందుతోంది. ఎండలో వచ్చిన ప్రజలకు ఈ చెట్లు సేదతీర్చుతున్నాయి.

చిట్టడవిని తలపిస్తున్న చెరుకువాడ రైల్వే స్టేషన్





చెరుకువాడ రైల్వేస్టేషన్‌లో పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోయిన దృశ్యం

ఉండి: ఉండి మండలం చెరుకువాడ రైల్వే స్టేషన్ చిట్టడవిని తలపిస్తోంది. పాములు, ఇతర విషజంతువులకు ఆవాసంగా మారింది. ఒక ప్లాట్‌ఫారం పూర్తిగా చెట్లు, చెత్తాచెదారంతో నిండిపోగా మరో ప్లాట్‌ఫారం పాక్షికంగా మొక్కలు, చెత్తతో పాటు ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. మొత్తం మీద ఇది రైల్వేస్టేషనా కాదా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. కనీస సదుపాయాలకు కూడా ఈ రైల్వే స్టేషన్ బహుదూరంగా ఉంది. తాగునీటి సదుపాయం ఉన్నా తాగునీరు రాక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే ఎండలు మండిపోతుంటే రైల్వే స్టేషన్‌లో చుక్కనీరు కూడా లభ్యం కాకపోవడం గమనార్హం. అంతే కాకుండా రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిపోయాయి. టికెట్ కౌంటర్ ఎదురుగా ఉన్న ప్లాట్‌ఫారం పొడవునా ఖాళీ మద్యం సీసాలు దర్శనిమిస్తుండడం గమనార్హం. రైల్వే స్టేషన్ మందుబాబులకు, ఇతర కార్యక్రమాలకు నిలయంగా మారిపోయిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ ఆరు ప్యాసింజర్ రైళ్లు వచ్చిపోయే ఈ రైల్వే స్టేషన్‌లో వసతులు మాత్రం అత్యంత దారుణంగా ఉన్నాయి. పగలే భయానకంగా ఉన్న రైల్వే స్టేషన్.. రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఆధునీకరించిన రైల్వే స్టేషన్‌లలో సదుపాయాలు ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చెరుకువాడ రైల్వే స్టేషన్‌లో సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అడుగు వేస్తే.. జారి పడాల్సిందే

అధ్వానంగా ప్యాట్రిక్ నగర్ రోడ్డు



బురదమయంగా మారిన స్థానిక ప్యాట్రిక్ నగర్‌కు వెళ్లే రహదారి

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని జాతీయరహదారికి చేర్చి ఉన్న ప్యాట్రిక్ నగర్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వస్తే అటుగా వెళ్లే ప్రజలకు ఈ దారి నరకప్రాయంగా మారింది. ఈ రోడ్డుపై అడుగు వేస్తే జారి ఆమడ దూరాన పడాల్సిందే. తమ కాలనీకి కనీసం డ్రెయినేజీ వసతి కూడా లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీకి పన్ను చెల్లిస్తున్నా తమను పట్టించుకునే నాథుడులేడని వాపోతున్నారు. ఏళ్ల తరబడి రహదారిలేక నానా యాతన పడుతున్నామని మహిళలు, వృద్ధులు, పిల్లలు ఆవేదన చెందుతున్నారు. నగర పంచాయతీ నిధుల్లో దళిత పేటలకు కేటాయించాల్సిన నిధుల్ని ఎక్కడ వెచ్చిస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్యాట్రిక్ నగర్‌లో రోడ్డు, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

ఘనంగా మావుళ్లమ్మ జాతర

భీమవరం: స్థానిక రెస్ట్‌హౌస్ రోడ్డులోని రామాలయం వద్ద తూర్పు కాపు సంఘం జాతర కమిటీ ఆధ్వర్యంలో శ్రీమావుళ్ళమ్మ 65వ జాతర మహోత్సవాలను ఆదివారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పుల వాయిద్యాలు, గరగల నృత్యాలు, శక్తి వేషధారణలతో జాతర నిర్వహించారు. జాతర కమిటీ సభ్యులు అడపా హరి, అడపా రాము, సతివాడ నవీన్, ఏకే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఆదాయానికి గండి

- పెరగని ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్
- వినోదపు పన్నుల విషయంలో మున్సిపాలిటీకి నష్టం
- నిర్లక్ష్యంలో నరసాపురం మున్సిపల్ అధికారులు



నరసాపురం మున్సిపల్ కార్యాలయం

నరసాపురం : వినోదం, ప్రకటనల పన్నుల విషయంలో నరసాపురం మున్సిపాలిటీకి భారీగా నష్టం కలుగుతోంది. కనీస స్థాయిలో కూడా వినోదం, ప్రకటనలకు సంబంధించి పన్నులు మున్సిపాలిటీకి జమ కావడం లేదు. ఇక ఏటా వచ్చే నామమాత్రపు ఆదాయం కూడా, ఏళ్ల తరబడి వసూలు కాకుండా, మొండి బకాయిగా మిగిలిపోతుంది. వినోదం పన్ను రూపంలో మున్సిపాలిటీకి ఏడాదికి రూ.3 లక్షలు మాత్రమే వసూలు అవుతుంది. ఇక ప్రకటనల పన్ను అయితే రూ.1.23 లక్షలు, మొత్తంగా రూ.4.23 లక్షలు పన్నులు వినోదం, ప్రకటనల రూపంలో వస్తున్నాయి. ఏడాదికి మున్సిపాలిటీకి ఆస్తి, కుళాయిలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, తదితర రూపాల్లో రూ.2.97 కోట్ల ఆదాయం వస్తోంది. ఇందులో వినోదం, ప్రకటనల పన్నుల వాటా చూసుకుంటే అత్యంత నామమాత్రంగా ఉంటుంది.

అదీ వసూలు కావడం లేదు

వినోదం పన్నులు రూ.10 లక్షలు, ప్రకటనల పన్నులు రూ.3 లక్షల వరకూ పాత బకాయిలున్నాయి. వినోదపు పన్నుల వద్దకు వచ్చే సరికి కేవలం సినిమా థియేటర్ల పైనే ఆధారపడుతున్నారు. కేబుల్ నిర్వాహకుల నుంచి సవ్యంగా పన్నులు వసూలు చేయడం లేదు. సిటీ కేబుల్ నిర్వాహకుల నుంచి లక్షల్లో పన్నులు వచ్చే ఇవకాశం ఉన్నా, వారి వద్ద నుంచి పన్నులు వసూలు చేయాలనే నిబంధనలు ఉన్నా, పట్టించుకోవడం లేదు. ఇక ఈ మధ్య కాలంలో ఎక్కడ పడితే అక్కడ ప్రకటనల హోర్డింగులు, ప్లెక్సీలు కనిపిస్తున్నాయి. వీటి నుంచి కూడా పన్నులు వసూలు చేయడం లేదు. రాజకీయ వత్తిళ్లకు తలొగ్గుతున్నారు. ఆదాయం వచ్చే మార్గాల్లో మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తూ అధికారులు మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారు. వినోదపు పన్నులు, ప్రకటనల చార్జీల పర్యవేక్షణ మొత్తం టౌన్ ప్లానింగ్ సెక్షన్ పర్యవేక్షణ చేస్తుంది. వినోదం, ప్రకటనల పన్నుల విషయంలో ఉన్న లోపాలను సరిదిద్దే చర్యలు ఇప్పటికైనా చేపట్టాలని పట్టణ వాసుల డిమాండ్ వినిపిస్తున్నారు.